andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 • కనిష్ఠం 18.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 9 జనవరి 2024



రేపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన

నిర్మల్ కల్చరల్, జనవరి 8 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే లోక్ సభ ఎన్నికల సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర గార్డెన్‌లో ఉదయం 11:30 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల కార్యకర్తలు, నాయకులు, పదాధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.



గుప్పిట్లో గుడులు

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

- దేవాదాయ శాఖలో గుత్తాధిపత్యం
- పదహారేళ్లుగా జిల్లాలోనే ఓ అధికారి తిష్ఠ
- ఆయన చెప్పిందే ఆ శాఖలో వేదం
- అప్పటి ప్రభుత్వ అండదండలతో ఇష్టారాజ్యం
- అధికారి తీరుపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

దేవాదాయ శాఖలో ఓ అధికారి దాదాపు పదహారేళ్లుగా తిష్ఠవేసి చక్రం తిప్పుతున్నారు. 2008 సంవత్సరం నుంచి ఆ అధికారి జిల్లాను కేంద్రంగా చేసుకొని అన్ని దేవాలయాలపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన చెప్పిందే వేదంగా నడిస్తోంది. దేవాదాయశాఖ పరిధిలోని చాలా ఆలయాలకు సంబంధించి నిధుల దుర్వినియోగం, దూపదీప నైవేద్యం లాంటి వ్యవహారాల్లో సదరు అధికారి పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులున్నాయి. దాదాపు పదహారు సంవత్సరాల నుంచి నిర్మల్ డివిజన్‌లో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగుతున్న సదరు అధికారి అవినీతిపై ఇటీవలే కొంతమంది ఆ శాఖ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారంటున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సదరు అధికారి ఉన్నతాధికారులను సైతం శాసించే స్థాయిలో కొనసాగారంటున్నారు. గత పదేళ్ల నుంచి జిల్లావ్యాప్తంగా దాదాపు 1800 పైగా నూతన ఆలయాల నిర్మాణాలు జరిగాయి. ఈ ఆలయాల నిర్మాణాల పనుల కోసం రిజిస్ట్రేషన్‌లు తప్పనిసరి అనే నిబంధన ఉంటుంది. ఈ నిబంధన సదరు ఇన్‌స్పెక్టర్‌కు కాసుల వర్షం కురిపించిందంటున్నారు. ప్రతీ ఆలయ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సంబంధిత ఒక్కో ఆలయకమిటీ నుంచి దాదాపు రూ.50వేల వరకు సదరు అధికారి బాహాటంగా వసూలు చేశారన్న ఫిర్యాదులున్నాయి. అలాగే దూపదీప నైవేద్యం కింద జిల్లావ్యాప్తంగా 500 ఆలయాలను ఎంపిక చేశారు. అయితే ఈ పథకం కింద దేవాలయాల్లో పూజలు చేసేందుకు అర్చకులను నియమించారు. ఈ అర్చకుల నియామక ప్రక్రియలో కూడా సదరు అధికారి వేల రూపాయలను వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. కాగా మరికొన్ని ఆలయాలు దూప, దీప నైవేద్యం కింద ఎంపిక కానప్పటికీ.. ఆ ఆలయాల్లో అర్చకులుగా నియమిస్తామంటూ చాలా మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కూడా సదరు అధికారిపై ఫిర్యాదులున్నాయి. కాగా ఈ అధికారి వాస్తవానికి జగిత్యాల జిల్లాలో ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జీ బాధ్యతలను ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. కాగా.. గత కొంతకాలం నుంచి అడెల్లి పోచమ్మ ఆలయం, దేవరకోట లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం, కాల్వ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయాల ఇన్‌చార్జీ ఈఓగా కూడా ఈ ఇన్‌స్పెక్టర్ వ్యవహరిస్తున్నారు. అయితే ఆయా ఆలయాల్లో జరిగే వివిధ రకాల పనులకు సంబంధించిన టెండర్‌ల వ్యవహారంలో కూడా సదరు ఇన్‌స్పెక్టర్ జోక్యం చేసుకొని డబ్బులు డిమాండ్ చేశాడన్న ఆరోపణలున్నాయి. టెండర్‌లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ల నుంచి బలవంతంగా కమీషన్‌లు కూడా వసూలు చేశాడన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా.. కొంతమంది నుంచి పెద్దమొత్తంలో డబ్బులు తీసుకొని టెండర్‌లు లేకుండానే ఆలయ పరిధిలోని పలు పనులను అలాగే వివిధ రకాల దుకాణాలను కేటాయించారంటున్నారు. సదరు అధికారిపై ఇప్పటికే పెద్ద ఎత్తున ఫిర్యాదులున్నప్పటికీ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు మాత్రం ఆయననే ఏళ్ల నుంచి ఇన్‌చార్జీగా కొనసాగిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని ప్రముఖులందరికీ ఈయన సన్నిహితుడు కావడం ఆయనకు కలిసి వచ్చిందంటున్నారు. అప్పటి ప్రభుత్వ పెద్దల అండదండలతోనే సదరు అధికారి దేవాదాయ శాఖలో చక్రం తిప్పే స్థాయికి ఎదిగారంటున్నారు. ఆయన కనుసన్నల్లోనే అన్ని రకాల కార్యకలాపాలు సాగుతుంటాయని చెబుతున్నారు. ఒకవేళ ఆయనకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే వారికి బదిలీ గాని లేదా వారిపై క్రమశిక్షణ చర్యల్లాంటి వాటిని కూడా చెప్పట్టడంలో సదరు అధికారి సిద్ధహస్తుడంటున్నారు. జిల్లాలో దేవాదాయశాఖ పేరు ఎత్తగానే సదరు అధికారి పేరు తప్ప ఇంకో పేరు గుర్తుకు రాదంటే అతిశయోక్తి కాదంటున్నారు.

విజిలెన్స్ విచారణపైనే అంతటా ఆసక్తి

కాగా.. సదరు అధికారి అవినీతి అక్రమాలు, ఇష్టారాజ్య వ్యవహారాలపై ఇప్పటికే పలువురు ఆ శాఖ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఇటీవలే కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నేపథ్యంలో సదరు అధికారిపై విజిలెన్స్ విచారణ సీరియస్‌గా మొదలుకానుందంటున్నారు. కొంతమంది ఆధారాలతో సహా సదరు అధికారి అవకతవకలపై ఫిర్యాదు చేశారంటున్నారు. దీని ఆధారంగానే విజిలెన్స్ అధికారులు రహస్యంగా విచారణ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. ఇప్పటికే ఈ అధికారి అవకతవకలకు సంబంధించిన ఆధారాలను సేకరించి నివేదికను సైతం రూపొందించారని చెబుతున్నారు. అప్పట్లో ఎలాంటి ఫిర్యాదు వచ్చిన సదరు అధికారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు జంకేవారు.

కారుణ్య నియామకం కింద..

సదరు అధికారి మొదట కారుణ్య నియామకం కింద పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమింపబడ్డారంటున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఈ అధికారి వరంగల్ పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా కొనసాగుతూ కొన్ని కారణాలతో సర్వీసు మార్పిడి కింద దేవాదాయ శాఖకు వచ్చారంటున్నారు. కాగా.. నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి 2018 సంవత్సరం వరకు నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు కొనసాగిస్తూ 2018 సంవత్సరంలో జగిత్యాలకు బదిలీ అయ్యారు. అయితే నిర్మల్ జిల్లా మంచి ఆదాయ వనరుగా ఉన్న కారణంగా ఆయన నిర్మల్ డివిజన్‌కు కూడా అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో ఇన్‌చార్జీగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఓ వైపు ఇన్‌స్పెక్టర్‌గానూ మరికొన్ని ఆలయాలకు ఈఓగానూ ఆయనే వ్యవహరిస్తూ దేవాదాయశాఖలో సమాంతర వ్యవస్థను నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే ఈసారి కొత్త సర్కారు కొలువు దీరిన కారణంగా అప్పటి అధికారుల అవకతవకలపై విచారణలు కొనసాగుతున్న నేపథ్యంలోనే సదరు అధికారిపై కూడా అదే రకమైన చర్యలు మొదలుకావచ్చంటున్నారు.



ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

- శ్రీకాంత్ రావు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, వరంగల్

ఈ విషయమై.. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రావును సంప్రదించగా.. సదరు ఇన్‌స్పెక్టర్‌పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కూడా ఈయనపై ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమేనన్నారు. ఈయన బాధితులు ఆధారాలతో సహా వస్తే వారికి న్యాయం చేస్తామన్నారు.



తర్లపాడ్‌లో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

వైభవంగా అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

ఖానాపూర్, జనవరి 8 : మండలంలోని తర్లపాడ్ గ్రామంలో సోమవారం రాత్రి అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా మంగళహారతులతో తరలివచ్చి రామయ్య అక్షింతలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఓంకారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని పురవీధుల గుండా అయోధ్య పూజిత అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలంతా పార్టీలకతీతంగా పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని మునిపెల్లి, చామన్‌పెల్లి గ్రామాల్లో సోమవారం రామ జన్మభూమి అక్షింతలను వితరణ చేశారు. రామ జన్మ భూమి అయినటువంటి అయోధ్య నుంచి వచ్చిన ఈ అక్షింతలను ఆయా గ్రామాల్లోని ప్రజలు తీసుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో ముని పెల్లి గ్రామ సర్పంచ్ కమల్‌కోట పద్మ వెంకట్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ సంపర్క ప్రముఖ్ సంత సాగర్ రెడ్డి పర్యావరణ ప్రముఖ్ మహేందర్ సిరిపురం, అఖిలేష్, మహిపాల్ రెడ్డి, సురేష్, మహేందర్, చిన్న మల్లేష్, శ్రీను, ప్రశాంత్ రెడ్డి, వెంకట్, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

ముధ్గల్‌లో రాములవారి అక్షింతల వితరణ



రాములవారి అక్షింతల శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, జనవరి 8 : మండలంలోని ముధ్గల్ గ్రామానికి సోమవారం చేరుకున్న అయోధ్య రామాలయ అక్షింతల ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో గ్రామ గ్రామానికి రాములవారి అక్షింతలు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి వచ్చిన అక్షింతలను పెద్ద ఎత్తున మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షింతల వితరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలేరావ్ రాంచందర్, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్ : అయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షింతలను సోమవారం నిర్మల్‌లోని విజేత అపార్ట్‌మెంట్‌లో అందజేశారు. ఆడెపు లలిత, కరుణ, మన్మధశ్రీ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



అక్షింతలు అందజేస్తున్న మహిళలు

ప్రజాపాలన దరఖాస్తులను త్వరగా కంప్యూటరీకరణ చేయాలి

• మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, జనవరి 8 : ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన కంప్యూటరైజ్ చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ పాల్గొన్నారు. కస్టం మిల్లింగ్ రైస్, వానాకాలం, యాసంగిపై జరిపిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ... 22 - 23 లక్ష్యాలు పూర్తికి ఆదేశించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డైలీ టార్గెట్ పూర్తికి ఆదేశించారు. ఆరు గ్యారంటీల దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగంగా పూర్తి చేయాలన్నారు. పొరపాట్లు జరగకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో దరఖాస్తులు ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పొర పాట్లు లేకుండా ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందు పర్చ నున్నట్లు తెలిపారు. సీఎంఆర్ లక్ష్యాలు సాధించేందుకు మిల్లర్లు, అధికారుల సమన్వ యంతో కృషి చేయనున్నామని అన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఎం శ్రీకళ, తదితర అధికారులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

• క్యాంపునకు బయలుదేరిన అసమ్మతి కౌన్సిలర్లు



క్యాంపునకు తరలివెళ్లిన మున్సిపల్ కౌన్సిలర్లు



మున్సిపల్ కార్యాలయం ఇదే..

నిర్మల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌పై అసమ్మతి కౌన్సిలర్లు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. చైర్మన్ ఈశ్వర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం దాదాపు 15 మందికి పైగా అసమ్మతి కౌన్సిలర్లు క్యాంపునకు బయలుదేరారు. అయితే వీరంతా బీఆర్ఎస్ కౌన్సిలర్‌లే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. గత కొద్దిరోజుల నుంచి పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్ ఈశ్వర్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆయనపై పరోక్షంగా విమర్శలు చేస్తూ అవిశ్వాస తీర్మానం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీంతో ఇక్కడి మున్సిపల్ రాజకీయం ఆసక్తికరంగా మారింది. అయితే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గత మూడు రోజుల క్రితం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని కౌన్సిలర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ అసమ్మతి కౌన్సిలర్లు వెనక్కి తగ్గకుండా చైర్మన్‌పై అవిశ్వాసానికి మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగానే ఇక క్యాంపు రాజకీయం మొదలైందని అంటున్నారు. మొదటి దఫా 15 మంది కౌన్సిలర్లు క్యాంపుకు తరలివెళ్లగా మిగతా కౌన్సిలర్లు కూడా ఒకటి రెండు రోజుల్లో క్యాంపునకు తరలివెళ్లే అవకాశం ఉందంటున్నారు. కాగా బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లకు కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు కూడా మద్దతు పలుకుతున్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు మహేశ్వర్‌రెడ్డి, అనుచరులే కారణం

• బీఆర్ఎస్‌పై బురదజల్లే యత్నం • ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వెంటనే నిలిపి వేయాలి • మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, జనవరి 8 : మండలంలోని గుండంపల్లిలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ప్రస్తుతం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఆయన అనుచరులే కారణమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీని వెనుక ఎవరున్నారో రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు తక్కల రమణారెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశం, సత్యం చంద్రకాంత్, ముత్యం రెడ్డి, ఏలేటి చిన్న నర్సారెడ్డి, తదితరులు ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమిపూజ చేశారన్నారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే పంట పొలాల మధ్య ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు తమ ప్రభుత్వంతో గానీ అధికారులతో గానీ ఎలాంటి చర్చలను కేంద్రం జరుపలేదన్నారు. గత ఏడాది ఏప్రిల్ 24న కేంద్ర ప్రభుత్వం అటవీ, పర్యావరణ అనుమతులు స్వీకరించకుండానే పరిశ్రమకు అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. కేంద్రం అనుమతి తరువాతే రాష్ట్ర కాలుష్య మండలి జూన్ 23న పర్యావరణ అనుమతులు మంజూరు చేసిందని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును తాము వ్యతిరేకించమని ఎన్నికల ముందు ఆ ఫ్యాక్టరీ తరలింపుకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఆ వెంటనే ఫ్యాక్టరీ పనులను ఎందుకు ప్రారంభించారో అధికార పార్టీతో పాటు బీజేపీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడే కంపెనీతో డీల్ కుదిరిందని, ఆ తరువాత ఆయన బీజేపీలో చేరిపోయారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. రైతులు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న రైతులపై జరిగిన లాఠీఛార్జీని ఖండిస్తున్నామని, వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వారి న్యాయ పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి న్యాయ పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు చిలుక రమణ, రాంకిషన్ రెడ్డి, ధర్మాజీ రాజేందర్, డాక్టర్ సుభాష్‌రావు, నల్ల వెంకట్రాంరెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

• రూ. రెండు వేల జరిమానా

నిర్మల్ కల్చరల్, జనవరి 8 : పెంబి మండలం కొలాంగూడ, పసుపుల గ్రామానికి చెందిన చిన్న గంగారాం(55) అనే వ్యక్తిని హత్య చేసిన నేరానికి గాను టేకం తుకారాం అనే నిందితుడికి జీవిత కాలం కఠిన జైలుశిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా న్యాయాధికారి ఏ. కర్ణ కుమార్ తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయ అధికారి సక్రియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించే సమయంలో పలుమార్లు వీరిద్దరి మధ్య గొడవలు జరుగడం ఈ హత్యకు దారితీసిందని తెలిపారు. 2018 డిసెంబరు 5న నిందితుడు గంగారాంను పంట చేను నుంచి తిరిగి వస్తుండగా గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట వినోదరావు 13 మంది సాక్షులను విచారించగా నేరం రుజువైందన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



గుండంపెల్లిలో ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న డీఏవో

దిలావర్‌పూర్, జనవరి 8 : మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, ఎవరైనా కొరత సృష్టించి రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. డీఏవో వెంట మండల వ్యవసాయ అధికారి స్రవంతి ఉన్నారు.

బాల బాలికలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యులు

నిర్మల్ కల్చరల్, జనవరి 8 : పద్దెనిమిదేళ్ల లోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక చట్టం ప్రకారం చర్యలు తప్పవని సీడబ్ల్యూసీ చైర్మన్ వహీద్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సీడబ్ల్యూసీ కృషి చేస్తోందన్నారు. ఇందుకుగాను జనవరి 1 నుండి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిశు సంక్షేమ శాఖ, పోలీసు, బాలల సంరక్షణ విభాగం, కార్మిక శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీ నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు హాస్టళ్లలో, కేజీబీవీ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. బాల కార్మికులు కనిపిస్తే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు జున్ను అనిల్, సైమన్, శ్రీలత, డీసీపీవో మురళి, కౌన్సిలర్ శైలజ, మమత, టు టౌన్ ఎస్సై అశోక్, తదితరులు పాల్గొన్నారు.





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
అట్రియమ్ - గచ్చిబౌలి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్ | మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ | టివోలి - సికింద్రాబాద్
జిఎస్‌ఎమ్ - మదీనగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్య - కవాడిగూడ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్ - అత్తాపూర్ | జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ | మరియు
డిఎస్‌ఎల్ మాల్ - ఉప్పల్ | మీ అభిమాన థియేటర్లలో



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
అట్రియమ్ - గచ్చిబౌలి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్ | మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ | టివోలి - సికింద్రాబాద్
జిఎస్‌ఎమ్ - మదీనగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్య - కవాడిగూడ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్ - అత్తాపూర్ | జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ | మరియు
డిఎస్‌ఎల్ మాల్ - ఉప్పల్ | మీ అభిమాన థియేటర్లలో

మనుషుల అక్రమ రవాణాను
నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఖానాపూర్, జనవరి 8 : మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సీడీపీవో సరిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనుషుల అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరమన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాలను ఆశగా చూపి కొంతమంది విదేశాలకు మనుషులను అమ్ముతున్నారని ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ఉన్న వారందరికీ అవగాహన కల్పించి రక్షించాలని కోరారు. అనంతరం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా గత 28 సంవత్సరాలుగా ఆయా ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 28,200 మంది అమ్మాయిలను కాపాడిందన్నారు. ప్రతి గ్రామంలో ఈ అంశాలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ శివ, అనిల్, ఫ్యాక్టలీ, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్ '

లక్ష్మణచాంద, జనవరి 8 : బీఆర్‌ఎస్ - కాంగ్రెస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ సోమవారం ఆరోపించారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలే తప్ప. ప్రజా సంక్షేమం గురించి ఆలోచన చేయటం లేదని ఎద్దేవా చేశారు. ప్రజా పాలన పేరుతో కాలయాపన చేస్తూ ప్రజ లను పక్కదారి పట్టిస్తుందన్నారు. అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేస్తామని, రైతు బంధు డబ్బులు ఖాతాలో వేస్తామని చెప్పి నెల రోజులు పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎంక్వయిరీ కావాలని డిమాండ్ చేసి ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత జ్యుడీషియల్ ఎంక్వయిరీ మాత్రమే చేస్తామనటం కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని అనటానికి నిదర్శనమన్నారు. దమ్ముంటే సంస్థ ఎంక్వయిరీ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేపీ మండల అధ్యక్షుడు పోలాస గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, నాయకులు కోంద్రు మోహన్, మల్లేష్, నారాయణ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ ఎమ్మెల్యేలకు
పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జీ బాధ్యతలు

భైంసా, జనవరి 8 : లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ పార్టీ ప్రణాళికబద్ధమైన విధానాలతో సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు పార్లమెంట్ నియోజక వర్గాల ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పచెప్పింది. పార్టీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి సోమవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఇద్దరు ఉండగా వారికి ఒక్కోక్కరికి ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ బాధ్యతలను అప్పచెప్పారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గానికి, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌కు పెద్దపెల్లి పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పచెప్పారు.

సమయపాలన పాటించండి

● డీఈవో రవీందర్‌రెడ్డి



కేజీబీవీ కుభీర్ పాఠశాలలో
ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

కుభీర్, జనవరి 8 : విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మధ్యాహ్నభోజన నిర్వాహణను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలను అడిగి సమాదానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను తెలుసు కున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ సమయపాలన పాటించి విద్యార్థుల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈయన వెంట ఏసీజీ పద్మా, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ, మండల స్పెషల్ ఆఫీసర్ హన్మండ్లు, ఎంఆర్‌వో సోము, కేజీబీవీ ప్రిన్సిపాల్ వాణి, సీఆర్‌టీలు, సీఆర్‌పీలున్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలి

ఖానాపూర్, జనవరి 8 : ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఖానాపూర్‌లోని మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆన్‌లైన్ నమోదులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి దరఖాస్తు పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఆయన వెంట స్థానిక అధికారులున్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



భైంసా, జనవరి 8 : పోలీసు అధికారులు, సిబ్బంది నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. సోమవారం భైంసాలోని తన కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా పెండింగ్ కేసుల పరిశోధన త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేకనిఘా పెట్టాలన్నారు. దొంగతనాల నివారణ కోసం రాత్రి వేళల గస్తీని ముమ్మరం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం గాను అవగాహన సదస్సు, చైతన్య సదస్సులు నిర్వహించాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రజలను జాగృతపరచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ చలనాల డిస్కౌంట్ ద్వారా అన్ని చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలన్నారు. వివిధ కేసులకు సంబంధించి తప్పించుకు తిరుగుతున్న నేరస్తులను పట్టుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రత పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అంకితభావంతో విధులను నిర్వహించాలన్నారు. ఇందులో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చేందుకు ఎడ్లను అమ్ముకుంటున్నారు : బొర్రన్న

సిరికొండ, జనవరి 8: గత వానాకాలం సీజన్‌లో రైతులు పంట చేలలో పత్తి, సోయాబీన్, మినుము, పెసర, జొన్న, తదితర పంటలకు బ్యాంకు రుణాలు అందక వడ్డీ వ్యాపారస్తుల నుంచి అప్పులను తీసుకుని పంటలు వేశారు. తాము కష్టించి పండించిన పంటలు సరిగ్గా పండకపోవడంతో పాటు, ప్రకృతి సహకరించక పోవడం వల్ల చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తమ వ్యవసాయానికి ఉపయోగపడే కాడెద్దులను అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టిలతో పాటు ఏదోరకంగా పంట నష్టపోతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి ఆదుకునేందుకు గత ప్రభుత్వం రైతుబంధు, పంట రుణమాఫీ పథకాలని ప్రవేశపెట్టిందన్నారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధును సకాలంలో అందించకపోవడం, పంట రుణమాఫీ జరుగకపోవడంతో అప్పులు తీర్చుకోవడానికి రైతులు ఎడ్ల జతలను అమ్ముకుంటున్నటున్నారని అన్నారు. ఇకనైనా పంట రుణమాఫీ, రైతు బంధు నిధులను వెంటనే విడుదల చేసి, ఆర్థిక భరోసా కల్పించినట్లయితే కొంతవరకైనా అప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట రైతులు బాబు, రోహిదాస్, ఆర్. శివలాల్, సుభాష్, తదితరులు ఉన్నారు.



ఇచ్చోడలోని ఎడ్ల సంతలో తన కాడెద్దులను అమ్ముకునేందుకు తీసుకువచ్చిన రైతులతో మాట్లాడుతున్న బొర్రన్న



ఐటీడీఏ ముందు ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన బొజ్జన్న బువ్వ కార్యక్రమంలో భోజనం చేస్తున్న గిరిజనులు

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, జనవరి 8: ఖానాపూర్ నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివాసీ పర్ధాన్‌సేవ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు ఆత్మీయ సన్మానం మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో పర్ధాన్ సేవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలు మంచినీటి సమస్య, సీసీ రోడ్లు, శ్మశాన వాటిక, హీరసుక భవన నిర్మాణం కోసం ఆర్థిక సహకారం, ఈహీరసుకా జయంతి నిర్వహిన కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆత్రం లక్ష్మణ్, దేవరి మడావి లక్ష్మణ్, పర్ధన్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెస్రం మనోహర్, డీటీడీవో మడావి గంగారాం, సిడాం భీమ్‌రావు, జిల్లా ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి ఆడ నగేష్, గ్రామపెద్దలు శేష నారాయణ, గన్ను, మలుకు, సూర్యవాన్, గోవిందరావు, మడావి శ్రీనివాస్, కుమ్ర శ్రీనివాస్, నారాయణ, రజని, గ్రామస్థులు పాల్గొన్నారు.

● 'గిరిజనుల ఆకలిని తీర్చేందుకు బొజ్జన్న బువ్వ'

ఉట్నూర్: ఐటీడీఏ కార్యాలయానికి సుదూర ప్రాంతాల ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల కోసం ప్రతి సోమవారం బొజ్జన్న భువ్వ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని కొత్తగూడ సర్పంచ్ ఆత్రంరాహుల్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట బొజ్జన్న బువ్వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజుజ పటేల్ ఆధ్వర్యంలో ప్రతీవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పేదల ఆకలిని తీర్చేందుకు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నదాన కార్యక్రమానికి ఐదు నెలలకు ముందే శ్రీకారం చుట్టారన్నారు ఈ అన్నదాన కార్యక్రమం ప్రతీ సోమవారం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, మాజీ సర్పంచ్ భీమన్న, మాజీ మండల అధ్యక్షులు దుటారాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్, నాయకులు మహేందర్, మెస్రం నగేష్, అక్షయ్‌పటేల్, మహిళలు బొజ్జన్న సైన్యం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ చేయాలి

● తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు, జనవరి 8: వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్‌ను పంపిణీ చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు తీసుకునేవ ఇనియోగదారులకు రేషన్ డీలర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలన్నారు. ముఖ్యంగా రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు. సమయపాలన పాటించని రేషన్‌డీలర్ల పై శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ప్రతీ వినియోగదారుడు ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. అంతేకాకుండా కొత్త రేషన్ కార్డు కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు.సంక్రాంతి పండుగ సమీపిస్తున్నందున రేషన్ డీలర్లు త్వరగా వినియోగదారులకు బియ్యన్ని పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్ రేషన్ డీలర్లు సంఘ అధ్యక్షుడు మూస, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఆపల్గొన్నారు.

● 'పకడ్బందీగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలి'

తలమడుగు: లబ్ధిదారుల కోసం అభివృద్ధి పథకాలను అందించేందుకు ఇటీవల చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత వారం రోజులుగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలు చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి లబ్ధిదారులకు నష్టం జరగకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను వేల 11717 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు దాదాపు మూడు వేలకు పైగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. నమోదు ప్రక్రియలు ఇలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సంప్రదించాలని, దరఖాస్తు ఫారాలో పథకాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. ఇందులో ఎంపీడీవో రమాకాంత్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీవో దిలీప్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహషీల్దార్ రాజమోహన్



ఉట్నూర్‌లో మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



కుమారిలో గడపగడపకు అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇంటింటికీ అయోధ్య రాముల వారి అక్షింతలు

ఉట్నూర్, జనవరి 8: అయోధ్య రామ మందిరం నుంచి పాత ఉట్నూర్ లోని శ్రీసీతారాముల ఆలయానికి వచ్చిన అక్షింతలను సోమవారం ఉట్నూర్, లక్కారంలలో ఇంటింటికి పంపిణీ చేశారు. హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పాత ఉట్నూర్‌లోని శ్రీసీతారముల ఆలయం నుంచి పూజారిసంతోష్‌దుబే ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హిందూ ఉత్సవ సమితి బృందానికి అప్పగించారు. భక్తులు బృందాలుగా ఏర్పడి ఉట్నూర్ లక్కారంలలోని వీధులలో పర్యటిస్తూ ఇంటింటికి అక్షింతలు చేరవేయడానికి రావడంతో ఆయా ప్రాంతాలలోని మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి అక్షింతలను తీసుకున్నారు. కార్యక్రమంలో కొండేరిరమేష్, భానోతు జగన్, కొండిబారావు, జాదవ్ శ్రీనివాస్, కపిల్‌కుమార్, మానాల లక్ష్మీనారాయణ, రామిని ప్రశాంత్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల కార్యక్రమం మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 8గంటలకు స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి ప్రారంభించడం జరుగుతుందని గ్రామపెద్దలు పిడుగు స్వామి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అయోధ్య నుంచి వచ్చిన ఆహ్వాన పత్రికలను స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఇందులో సహకార సంఘం డైరెక్టర్ జక్కుల అడెల్లు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పి.వెంకటిరెడ్డి, ఉప సర్పంచ్ టి.రాకేష్‌రెడ్డి, నాయకులు చిల్కూరి భోజారెడ్డి, చిల్క చిన్నన్న, సామ రమేస్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: నేరడిగొండ మండలం కుమారి గ్రామంలో గడపగడపకు అయోధ్య శ్రీరాములవారి అక్షింతలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా అయోధ్య గుడి చిత్రపటం, కర పత్రాలను హిందూ సంస్థల నాయకులు, శబరిమాత భక్తులు, గ్రామస్థులు పంపిణీ చేశారు.

శనగ పంటకు తెగుళ్లు

● ఆందోళనలో ఆయా గ్రామాల శనగ రైతులు

తాంసి, జనవరి 8: ప్రస్తుతం శనగ పంటకు తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి వాతావరణంలో పెను మార్పులు సంభవించడంతో శనగ పంట ఆకులన్నీ రాలిపోతున్నాయి. పొగమంచు కారణంతో వచ్చిన పూత వచ్చినట్లే రాలిపోతుందని శనగ రైతులు పేర్కొంటున్నారు. తాంసి మండలంలో ఈ సంవత్సరం సుమారు 800 పైచిలుకు ఎకరాలలో శనగ పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం శనగ విత్తనాలు నాటి 40 నుంచి 45 రోజులు కావస్తుంది. ప్రస్తుతం పూతకు వచ్చేదశ, కాని ఇంకా ఏ పంట పొలంలో కూడా పూత రాలేదు. వచ్చిన పూత వచ్చినట్లే రాలిపోతోందని రైతులు పేర్కొంటున్నారు. మరో ఐదారు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే శనగ పంట చేతికి రాదని అంటున్నారు. ఇదిలా ఉంటే పంటను కాపాడుకునేందు కోసం నివారణ చర్యలు తెలియక కూడా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని మండల రైతులు కోరుతున్నారు.



తెగులు సోకిన శనగ పంట చేను

గిరిజన విద్యార్థులకు 'తానా' ప్రశంసలు

ఉట్నూర్, జనవరి 8: మండలంలోని లక్షేటిపేట్‌లో గల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.నఖిల్, కె.సూర్, డి.మారుతి, ఎం.వరుణ్ సందేశ్, జి.రాజేశ్వర్, టి.గురురాం, టి.మహేశ్, జె.నవీన్, కె.జంగు, కె.రాంసాయి, కె.తుకరాం, నాగచైతన్యలు ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా వారి ప్రశంసపత్రాలను అందుకున్నారు. వంద దేశాల్లో ఉన్న వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా తానా అమ్మనాన్న గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని పాఠశాల హెచ్ఎం విఠల్ తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాశాల లక్షేటిపేట్‌లో విద్యార్థులు చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థలం చేసి గానం చేశారని ఆయన పేర్కొన్నారు. కాగా, ప్రశంస పత్రాలను పాఠశాల ఉపాధ్యాయులు వార్డెన్ రాథోడ్, ప్రకాష్, ఎ.భూమేష్, జె.వీరేందర్, బాపురావు, మధుసూదన, ధరంసింగ్, ఓం.ప్రకాష్, ఆర్తి, జైవంత్‌రావు, తదితరుల చేతుల మీదుగా అందజేశారు.

'పట్టుదలతో కష్టపడి చదవాలి'

ఇంద్రవెల్లి, జనవరి 8: పట్టుదలతో కష్టపడి ఉన్నత చదువులు చదవాలని ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంధాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామంలో గల యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంతో చదువులు మధ్యలోనే ఆపకుండా పట్టుదలతో చదవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివితేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు తనవంతుగా సహాయ సహకారాలు అందించడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

మావల/బోథ్, జనవరి 8: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మావల ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన అఖిలేష్ సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తుంటాడు. ఫీల్డ్‌లో పని ముగించుకొని గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వస్తున్నారు. ఈ క్రమంలో బట్టిసావర్గం జాతీయ రహదారి వద్ద రాంగ్ రూట్‌లో కంటేనర్ లారీ వచ్చి అఖిలేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు కాగా అఖిలేష్(29) అక్కడికక్కడే మృతి చెందాడు. సోనాల మండల కేంద్రానికి చెందిన అఖిలేష్ సర్వ శిక్ష అభియాన్ కార్యక్రమంలో కాంట్రాక్టు ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే యువకుడు మృతి చెందడం వల్ల గ్రామంలో విషాదం అలుముకుంది. అఖిలేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు.

బసవన్న అంతిమయాత్ర

బజార్‌హత్నూర్, జనవరి 8: మండల కేంద్రానికి చెందిన చట్ల వినీల్ రైతు తనకు ఆరుగాలం పాటు వ్యవసాయంలో చేదోడువాదోడుగా నిలిచిన బసవన్న వయస్సు మీద పడడంతో రాత్రి సమయంలో ప్రాణాలను విడిచింది. ఆ సమయం నుంచి తెల్లవారే వరకు భజన బృందంచే భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు వినీల్ మాట్లాడుతూ గత 20 ఏళ్లకు పైగా తమ కుటుంబంలో సభ్యుడిగా చూసుకున్న మా బసవన్న, మా కష్టాలలో ఎదుగుదలలో, అన్ని సమయాలలో మాకు తోడుగా నిలిచిందని తెలిపారు. అందుకే మానుంచి దూరమైన బసవన్నకు భాజాభజంత్రీల మధ్య టపాసులు కాల్చుతూ రథంపై ఘంగా ఊరేగించి అంతిమ సంస్కారాలు నిర్వహించామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించండి : ఏఎస్సై

ఉట్నూర్, జనవరి 8: వాహనదారులుందరు సకాలంలో పెండింగ్ చలాన్‌ల బిల్లులు చెల్లించి, డిస్కౌంట్ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ఏఎస్సై దిలీప్ అన్నారు. సోమవారం మండలంలోని నాగపూర్ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలలో భాగంగా వాహనదారులను కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ చలాన్ల చెల్లింపులలో 80శాతం మినహాయింపు ఇచ్చినందున ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర వాహనాలదారులు కూడా తమ పెండింగ్ చల్లాన్లను చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

పొన్న-సుంకిడి వరకు రోడ్డును మంజూరు చేయాలని వినతి

సిరికొండ, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా గతంలో సిరికొండ మండలాన్ని ఏర్పాటుచేసి ఏళ్ల గడుస్తున్నా, మండల కేంద్రం నుంచి పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించ లేకపోవడంతో పల్లెవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పొన్న గ్రామ పంచాయతీ ప్రజలు సిరికొండ మండల కేంద్రానికి చేరుకోవాలంటే దూరభారంతో పాటు, ఆర్థిక భారం అవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా రోడ్డు సౌకర్యం కల్పించలేకపోయారని అన్నారు. దీంతో మండల కాంగ్రెస్ పార్టీ నేతలు స్పందించి పొన్న గ్రామం నుంచి సుంకిడి వరకు రెండు గ్రామాలను కలుపుతూ లింకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లకు వినతిపత్రాలను అందజేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, పొన్న గ్రామస్థులు సదానందం, సంజీవ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి నిధులను విడుదల చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 8: పట్టణ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మున్సిపల్ చైర్మన్ మాజీ మంత్రి రామన్న చొరవతో నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం వాటిని నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ఇందులో కౌన్సిలర్ ఆవుల వెంకన్న, ఇమ్రాన్, మిషు, భూమన్న, శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి


తలమడుగు, జనవరి 8: మండలంలోని ఉండం గ్రామానికి చెందిన సూరం ప్రశాంత్(32) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రశాంత్ గత ఆరు నెలలుగా వెన్నునొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ తగ్గలేదు. దీంతో మానసిక శోభకు గురై 6న గ్రామ శివారులోని పోచమ్మ ఆలయం సమీపంలో పురుగుల మందు తాగి స్పృహ తప్పిపడిపోయాడు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలిచంగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఆరు సంవత్సరాల కుమారుడు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తలమడుగు పోలీసులు పేర్కొన్నారు.














'ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చూడాలి'

తాంసి, జనవరి 8: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాను సవరించి ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని తాంసి తహసీల్దార్ లక్ష్మీ అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు సోమవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటరు జాబితా అప్‌డేట్ గురించి అవగాహన కల్పించారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్ నరేష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సిబ్బంది ప్రశాంత్, స్వాగత్, తదితరులు ఉన్నారు.


● కేఆర్‌కే కాలనీలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు..

'డబుల్' ఇళ్లను.. ఎప్పుడిస్తారు?

- జిల్లాలో అమలుకు నోచుకోని గత ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం
- పలుచోట్ల లక్కీడ్రా నిర్వహించినా.. లబ్ధిదారుల్లో అయోమయం
- ఇప్పటికీ అసంపూర్తిగా వందలాది ఇళ్లు
- మూడు విడతల కింద 3,862 ఇళ్లు మంజూరవ్వగా.. 3381 ఇళ్లకు మాత్రమే పరిపాలనా అనుమతులు
- అందునా 3098 ఇళ్లకు టెండర్లను పిలువగా.. 1902 ఇళ్లకు మాత్రమే పూర్తి
- ఇప్పటికీ వివిధ దశల్లోనే 1,298 'డబుల్' ఇళ్ల నిర్మాణ పనులు
- ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- ఇటీవల 'ప్రజాపాలన'లో గృహలక్ష్మి దరఖాస్తులే ఎక్కువ
- కొత్త ప్రభుత్వం పైనే నిరుపేదల ఆశలు
- జిల్లావ్యాప్తంగా కేవలం 518 డబుల్ ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తి

ఆదిలాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం జిల్లాలో ఓ అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా కనిపిస్తోంది. జిల్లాలో వందలాది డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. పడుతూ లేస్తూ ఈ పథకం అనుకున్నంత స్థాయిలో ముందుకు సాగలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన ప్రతీఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇంటిని నిర్మించి ఇస్తామని చెప్పినా.. అమలుకు మాత్రం నోచుకోలేదు. దీంతో లబ్ధిదారుల ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది. జిల్లాలో మూడు విడతల కింద 3,862 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 3381 ఇళ్లకు మాత్రమే పరిపాలన అనుమతులు దక్కాయి. 3098 ఇళ్లకు అధికారులు టెండర్లను పిలువగా కేవలం 1902 ఇళ్లకు మాత్రమే టెండర్లు పూర్తయ్యాయి. దీంతో 1298 ఇళ్ల నిర్మాణ పనులు మొదలైన వివిధ దశల్లోనే కనిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో 518 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేసినట్లు అధికారులుపేర్కొంటున్నారు. అయితే అరకొరగా పూర్తయిన ఇళ్లను కేటాయిస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసంపూర్తిగానే మిగిలి పోయిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పై కొత్త ప్రభుత్వం స్పష్టతనివ్వక పోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. గతంలో చాలీచాలని నిధులు, స్థల సేకరణలో చాలా ఇబ్బందులు ఎదురుకావడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. దీంతో అధికారులు కాంట్రాక్టర్లు చేసేది ఏమీలేక చేతులెత్తేయడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుపేద ప్రజలు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయిస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లబ్ధిదారులను గుర్తించినా..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించేందుకు కొంత హడావుడి చేసింది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో దరఖాస్తులను స్వీకరించి లక్కీ డ్రా ద్వారా 782 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. అయినా ఇప్పటి వరకు ఏఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించలేదు. దీంతో లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. అసలు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తారా? లేదా? అని ప్రశ్నిస్తున్నారు. ఇంతలోనే కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆందోళన కనిపిస్తోంది. గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది వరకే పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు లబ్ధిదారులు ధర్నాలు, నిరసనలు చేపట్టినా ప్రయోజనం కనిపించ లేదు. ముఖ్యంగా కేఆర్‌కే కాలనీ, మావల, జైనథ్, తదితర గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు దాదాపుగా పూర్తయినా.. లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. మరి కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించినా.. ఏం లాభమన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



కొత్త పథకానికి శ్రీకారం

డబుల్ బెడ్‌రూం పథకం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు కట్టుకునే వారికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, స్థలం లేని వారికి ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఇప్పుడైనా తమకు ఇళ్లు దక్కుతాయని పేద ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో డిప్యూటేషన్ పై వేరే శాఖల్లో పని చేస్తున్న హౌజింగ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మూడు రకాల ఇందిరమ్మ ఇళ్ల నమునాలను సిద్ధం చేసి ఫైనల్ చేసేందుకు కసరత్తు చేస్తోంది. త్వరలోనే ఇళ్ల నమునాలను నిర్ణయించి అర్హులైన లబ్ధిదారులకు పథకాన్ని వర్తింప చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు కసరత్తును మొదలుపెట్టింది. గృహలక్ష్మి పథకం కింద ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు దరఖాస్తులను కూడా స్వీకరిస్తోంది. ఇప్పటికే ప్రజాపాలన అభయ హస్తం పేరిట దరఖాస్తులను స్వీకరించడంతో.. గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఐదు గ్యారెంటీలలో గృహలక్ష్మి పథకానికే ప్రజలు ఎక్కువగా దరఖాస్తు చేసుకోవడం కనిపించింది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పథక అమలుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపూర్తి కాగానే గృహలక్ష్మి పథక అమలుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఆలోగా విధివిధానాలను ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. మొదట ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకాన్ని మంజూరు చేసి దశల వారీగా అర్హులైన వారందరికీ.. ఇంటి నిర్మాణం కోసం నగదు సహాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. అయితే గత పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారందరూ.. ఈసారి దరఖాస్తులు చేసుకోవడంతో గృహలక్ష్మి పథకానికి భారీ డిమాండ్ ఏర్పడుతోంది. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ఏ విధంగా ఉంటుందోనన్న ఆసక్తి కనిపిస్తోంది. అయితే ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలు ఖరారయ్యే వరకు ఏమీ చెప్పలేమని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతోనే లబ్ధిదారుల ఎంపిక

: బసవేశ్వర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి

గృహలక్ష్మి పథకంపై ఇంకా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అందలేదు. గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై కూడా స్పష్టత రాలేదు. నిర్మాణ దశలో ఉన్న మరికొన్ని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పూర్తి, బిల్లుల చెల్లింపుపై ఆదేశాలు అందాల్సి ఉంది. ఆ తర్వాతనే కొత్త పథకం అమలుపై చర్యలు తీసుకుంటాం. ఇందిరమ్మ ఇళ్ల కోసమే ఎక్కువగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తుంది.

సంక్షిప్త సమాచారం

29న చలో ఇందిరా పార్కు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 8: ఆదివాసీల హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ నిరుద్యోగ గోస ధర్నాని ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు చేయనున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడంగణేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 5 షెడ్యూల్ భూభాగంలోని క్లాస్ 1 ప్రకారం స్థానిక ఆదివాసీల చేతనే ఉద్యోగాల భర్తీ చేపట్టాలి. కాని ఆదివాసీ నిరుద్యోగులకు దక్కవల్సిన ఉద్యోగాలన్ని జనరల్ నోటిఫికేషన్‌తో మైదాన ప్రాంత వాసులను ఉద్యోగ భర్తీ చేస్తున్నారని అన్నారు.

'15 రోజుల నుంచి భగీరథ నీళ్లు అందడం లేదు'

తలమడుగు, జనవరి 8: గత ప్రభుత్వం ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు వేల కోట్ల రూపాయలతో ప్రారంభించిన మిషన్ భగీరథ నీరు బోథ్ నియోజకవర్గంలోని తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లోని 110 గ్రామాలకు గత 15 రోజుల నుంచి నీరు అందడం లేదని సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డిని కలిసి తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలమడుగు, తాంసి, భీంపూర్, మండలాల్లోని 110 గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ల పోచంపాడు నుంచి సరిగ్గా సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సుంకిడి గ్రామంలో నిర్మిస్తున్న సంపు పనులని త్వరగా పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

తాంసిలో ప్రజా దర్బార్

తాంసి, జనవరి 8: మండల కేంద్రంలోని తాంసి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కప్పర్ల, జామిడి, హస్నాపూర్ గ్రామాలకు చెందిన పలువురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తమకు ప్రభుత్వ పథకంలో అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భూమయ్య మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఇందులో ఎలాంటి అనుమానాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నాన్ టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ, జనవరి 8: మండలంలోని కేజీబీవీలో బోధనేతర సిబ్బంది అసిస్టెంట్ కుక్ పోస్టు-1 ఖాళీగా ఉన్నట్లు మండల విద్యాధికారి రాథోడ్ ఉదయ్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టుకు మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని, కనీస విద్యార్హత 7వ తరగతి పాసై ఉండాలని, 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనలె 11వ తేదీలోగా ఎంఈవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ● అభయహస్తం దరఖాస్తుల స్వీకరణపై వీడియో కాన్ఫరెన్స్ ● పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 8: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అభయహస్తం దరఖాస్తులు ఎలాంటి పొరాట్లకు తావులేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులవివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టం నమోదు చేయాలని తెలిపారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలు, నూతన రేషన్‌కార్డులు, పెన్షన్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు సంఖ్య, కులం,పుట్టిన తేదీ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్‌నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలతో కూడిన ఆన్‌లైన్ ఫారంను ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తు ఫారంలో ఉన్న ప్రకారంగానే నమోదు చేసే విధంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి అధికారుల పర్యవేక్షణలో అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రారంభించడం, నిర్వహించడం జరుగుతుందని, ఈ నెల 17 లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా జిల్లాలోని రైస్ మిల్లర్లకునిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సమన్వయంతో కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా, శ్యామలాదేవి, జిల్లాపౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుధారాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి)

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● 'ప్రజా ఫిర్యాదుల విభాగం'లో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 8: ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగం కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ధరణి, ఆసరా, రెండు పడక గదుల ఇండ్లు, ఇతర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.ఇప్పటి వరకు ఫిర్యాదు విభాగంలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పర్కిరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా సమీక్షిస్తూ విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సంక్షేమ, ఇంజనీరింగ్, ఇతర శాఖలు చేపట్టే పనుల పై ముందస్తు ప్రణాళికలు రూపొందించి నివేదికలను సమర్పించాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా, శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్‌రమేష్, డీఆర్డీఓ కిషన్, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



సీఎం ఓఎస్డీని కలిసిన జిల్లా కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్‌డీగా నియమితులైన జిల్లా వాసి గోపిడి చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం జిల్లా కాంగ్రెస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి, పలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు. సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారని వారు తెలపారు. ఇందులో టీపీసీసీ సెక్రటరీ సత్తుమల్లేష్‌కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, నిమ్మల రమణారెడ్డి, దుర్గేనారాయణ, తదితరులున్నారు.

◄ సీఎం ఓఎస్డీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా నేతలు


స్వాగతం పలుకుతున్న ఐటీడీఏ పీవో, అధికారులు

రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ సాధించిన గిరిజన క్రీడాకారులకు ఘన స్వాగతం

ఉట్నూర్, జనవరి 8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసానిలో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుని ఉట్నూర్‌కు చేరుకున్న గిరిజన క్రీడాకారులకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయి ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి విజేతలకు మిఠాయిలు తినిపించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జుతో పాటు పీవో, ఎస్సీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డి, డీడీ దిలీప్ కుమార్‌లు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రాష్ట్ర గిరిజన క్రీడా ఉత్సవాల్లో ఉట్నూర్ ఐటీడీఏ క్రీడాకారులు తొలిసారిగా 12 చాంపియన్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అందుకు కృషి చేసిన అధికారులు కోచ్‌లను అభినందించారు. రాబోయే ఐఎస్ఎల్ క్రీడల్లోనూ సత్తా చాటాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, భుక్య రమేష్, హెచ్‌ఎంలు గోడం చందన్, కృష్ణరావ్, ప్రేమ్‌దాస్, జాదవ్‌హేమంత్, రవీందర్, శ్రీనివాస్, గోపాల్, జలపతి, సునంద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


పీవోకు క్రీడా పతాకాన్ని అందజేస్తున్న జిల్లా క్రీడల అధికారి పార్థసారథి

రాష్ట్రస్థాయి క్రీడల పతాకం అందజేత

ఉట్నూర్, జనవరి 8: వచ్చే యేడాదిలో ఉట్నూర్‌లో నిర్వహించనున్న గిరిజన సంక్షేమ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించిన క్రీడా పతాకాన్ని సంబంధిత అధికారులు ఉట్నూర్ ఐటీడీఏకు అందించారు. ఇటీవల భద్రాద్రి కిన్నెరసానిలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో జరిగిన క్రీడా ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు భద్రాద్రి పీవో ప్రతిక్‌జైన్ క్రీడా పతాకాన్ని ఆదిలాబాద్ జిల్లా క్రీడల అధికారి పార్థసారథికి అందించడంతో ఆయన సోమవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయికి ఈ పతాకాన్ని అందించారు. రాష్ట్రస్థాయి గిరిజన క్రీడల్లో ఉట్నూర్ ఐటీడీఏ తరపున క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు సాధించిన ఓవరాల్ చాంపియన్‌షిప్, ఇతర కప్పులను అందించగా రాష్ట్ర స్థాయి జరిగిన క్రీడోత్సవాల గురించి పీవో క్రీడల అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే సంవత్సరం నిర్వహించే గిరిజన క్రీడోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తామని ప్రాజెక్టు అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి పార్థషారథితో పాటు ప్రధానోపాధ్యాయులు చందన్, ఉత్తమ్, కృష్ణారావు, రాథోడ్‌ప్రకాష్, ప్రేమ్‌దాస్, గోపాల్, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్‌హేమంత్‌నాయక్, శ్రీనివాస్, భీమ్‌రావ్, పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, కోచ్‌లు శేఖర్, సునంద, తదితరులు పాల్గొన్నారు.

